సాక్షి
కాకినాడ

బుధవారం । 13 । నవంబర్ । 2024




సూక్ష్మ శివలింగం


తుని: కార్తిక మాసం సందర్భంగా తునికి చెందిన స్వర్ణకారుడు కె.కోటేశ్వరరావు 100 మిల్లీగ్రాముల బంగారంతో సూక్ష్మ శివలింగాన్ని రూపొందించారు. ఇది అందరినీ ఆకట్టుకుంటోంది.



మరిడమ్మకు వెండి వడ్డాణం

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తికి గేదెల వీర వెంకట సూర్య కిరణ్, నిహారిక దంపతులు (పెద్దాపురం) మంగళవారం 167 గ్రాముల వెండి వడ్డాణం సమర్పించారు.

22 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం సాయంత్రం 22,392 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 3,600 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

రత్నగిరిపై భక్తుల రద్దీ

- సత్యదేవుని దర్శించిన 60 వేల మంది
- 5,924 వ్రతాలు
- రూ.60 లక్షల ఆదాయం



స్వామివారి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: కార్తిక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయానికి మంగళవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. వ్రతాలు 5,924 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి సుమారు రూ.60 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఏకాదశి తిథి కావడంతో సత్యదేవునికి ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ కుంకుమార్చన నిర్వహించి, స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు సుధీర్, దత్తుశర్మ, రుత్విక్కులు ఈ పూజలు నిర్వహించారు. సత్యదేవుని ఆలయం వద్ద చేసిన పుష్పాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. అనివేటి మండపం వద్ద పుష్పాలతో తిరునామం దానికి రెండువైపులా ఏనుగుల బొమ్మలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అరుణాచలానికి రేపు ప్రత్యేక బస్సు

తుని: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు తుని నుంచి గురువారం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని ఏపీఎస్ ఆర్టీసీ తుని డిపో మేనేజర్ కిరణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు తుని డిపో నుంచి ఈ బస్సు బయలుదేరుతుందన్నారు. భక్తులు విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కంచి క్షేత్రాలను దర్శించుకోవచ్చని వివరించారు. పెద్దలకు రూ.3,500, పిల్లలకు రూ.2,625గా టికెట్ చార్జీ నిర్ణయించామని తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం 85550 58080 నంబర్‌ను, వివరాలకు తుని డిపో అసిస్టెంట్ మేనేజర్‌ను 73829 21904 నంబర్‌లోను సంప్రదించాలని ఆయన కోరారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ

కాకినాడ రూరల్: బాల్య వివాహాల నిరోధంపై తల్లిదండ్రులు అవగాహన పెంపొంచుకోవాలని ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ అన్నారు. రూరల్‌ను బాల్య వివాహ రహిత మండలంగా తయారు చేద్దామనే నినాదంతో సర్పవరం జంక్షన్ వద్ద ఎంపీడీఓ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల్య వివాహాల నిరోధానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. జిల్లాలో 26 శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. చైల్డ్ మ్యారేజెస్ చట్టం–2006, జీఓ 31 గురించి వివరించి, క్షేత్ర స్థాయి సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ కో ఆర్డిరేటర్ స్వర్ణలత, ఎంపీడీఓ సతీష్, సీడీపీఓ లక్ష్మి, డీసీపీఓ వెంకట్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జీఎన్ఎం, బీఎస్సీ చదివిన వారికి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, క్యూరా పర్సనల్ ఆధ్వర్యాన జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు మంగళవారం తెలిపారు. దీనికి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, 6 నెలల పాటు గుంటూరులో శిక్షణ ఇచ్చి, జర్మనీలో ఉద్యోగం కల్పిస్తారని వివరించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. వసతి ఖర్చులు అభ్యర్థులే భరించాలన్నారు. డిపాజిట్ రూ.75 వేలు చెల్లించాలని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు దాదాపు రూ.2.30 లక్షల వరకూ వేతనం ఉంటుందన్నారు. వివరాలకు 85008 85866 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చిల్లరతో పనేముంది..!

- డిజిటల్ విధానంలో విస్తృతంగా నగదు చెల్లింపులు
- జిల్లాలో ప్రతి నెలా రూ.9 వేల కోట్ల లావాదేవీలు
- వీటిలో 50 శాతం నగదు రహితమే..



కాకినాడలోని ఒక పాన్‌షాప్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లిస్తున్న వినియోగదారు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నోటు చిరిగిపోయిందనే బెంగ లేదు.. కొనుగోలు చేసిన సరకుల కంటే అదనంగా ఇచ్చిన సొమ్ములకు తిరిగి చిల్లర ఇవ్వాల్సిన పనే లేదు. డబ్బు లెక్క పెట్టాల్సిన అవసరం ఎంత మాత్రం లేదు. అది హైపర్ మార్కెట్ అయినా.. డిపార్ట్‌మెంటల్ స్టోర్ అయినా.. హోటల్ అయినా.. ఫ్రూట్ జ్యూస్ షాప యినా.. రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై అమ్మే కొబ్బరి బొండాలైనా.. మొక్కజొన్న పొత్తులైనా.. గోలీ సోడాలైనా.. ఇలా దేనికైనా ఇప్పుడంతా డిజిటల్ చెల్లింపులే. రూపాయి పెట్టి కొనే అగ్గిపెట్టె దగ్గర నుంచి లక్షల రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాల వరకూ.. ఇలా మార్కెట్‌లో ఏది కొనుగోలు చేయాలన్నా నగదు రహిత లావాదేవీలదే సింహభాగం.

ఆర్‌బీఐ ప్రోత్సాహంతో..

అన్ని బ్యాంకుల్లోనూ నూరు శాతం నగదు రహిత లావాదేవీలు జరిగే విధంగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో దాదాపు అన్ని వాణిజ్య, సహకార బ్యాంకులు సైతం ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు పోటీ పడుతున్నాయి. ఒకప్పుడు రూ.100 కావాలంటే పనులన్నీ పక్కన పెట్టి, పనిగట్టుకుని బ్యాంకుకు వెళ్లి క్యూలో నిలుచుని, విత్‌డ్రా ఫామ్ నింపి, టోకెన్ తీసుకుని, కాసేపు వేచి ఉంటేనే కానీ నగదు చేతికొచ్చేది కాదు. అటువంటి పరిస్థితికి భిన్నంగా గుమ్మం దాటకుండానే నగదు రహిత లావాదేవీలు చేసుకునే అవకాశం రావడంతో ప్రజల అవసరాలు క్షణాల్లో తీరిపోతున్నాయి. సమయం కలసి రావడం, జేబులో సొమ్ము పోతుందనే బెంగ లేకపోవడంతో వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపులు అలవాటు చేసుకుంటున్నారు. అనేక మంది తమ స్మార్ట్ ఫోన్లలో ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకుని, నగదు రహిత లావాదేవీలు సాగిస్తుండటంతో బ్యాంకులకు వస్తున్న ఖాతాదారుల సంఖ్య కూడా తగ్గుతూ వస్తోంది. ఇప్పటికే బ్యాంకులకు వచ్చే వారిలో 50 శాతం ఖాతా దారులు తగ్గిపోయారని బ్యాంకింగ్ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కరోనా భయంతో ఆరంభమై..

కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో ఇతరులను తాకాలన్నా, వారి వస్తువులు ముట్టుకోవాలన్నా ప్రతి ఒక్కరికీ హడలే. ఈ క్రమంలో కరెన్సీ నోట్లు ఒకరి నుంచి మరొకరు తీసుకుంటే కోవిడ్ సోకుతుందేమోననే ఆందోళనకర పరిస్థితులు అప్పట్లో నెలకొన్నాయి. అదే సమయంలో బ్యాంకులకు వెళ్లే పరిస్థితి కూడా లేకపోయింది. సరిగ్గా అదే సమయంలో నగదు రహిత లావాదేవీలు జోరందుకోవడం మొదలైంది. కరోనా వ్యాప్తి కారణంగా 2020–21లో మొదలైన ఈ నగదు రహిత లావాదేవీలు గడచిన మూడేళ్లలో జిల్లాలో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. కోవిడ్ తగ్గినప్పటికీ పేటీఎం, ఫోన్‌పే వంటి యాప్‌ల వినియోగం పెరగడంతో ఆన్‌లైన్ లావాదేవీలు పెరుగుతూ వస్తున్నాయి. నగదు రహిత లావాదేవీల్లో 60 నుంచి 70 శాతం మైలు రాయిని అధిగమించాలని ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆర్‌బీఐ ఉన్నతాధికారులు సూచించారు. దీనికి అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు నగదు రహిత లావాదేవీల్లో పోటీ పడుతున్నాయి.

యూబీఐతో ఎస్‌బీఐ పోటీ

జిల్లాలో ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకులు 38 ఉన్నాయి. ప్రధానంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, చైతన్య గోదావరి బ్యాంకుల పరిధిలో 357 బ్రాంచ్‌లు ఉన్నాయి. నగదు రహిత లావాదేవీల్లో మొదటి వరుసలో ఉన్న యూబీఐతో ఎస్‌బీఐ పోటీ పడుతోంది. మిగిలిన బ్యాంకులు ఈ రెండింటి తరువాతనే ఉన్నాయి. తాజా నివేదిక ప్రకారం ఈ అన్ని బ్యాంకుల ద్వారా జిల్లాలో ప్రతి రోజూ సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్ల వరకూ లావాదేవీలు జరుగుతూంటాయి. వీటిలో ఆన్‌లైన్, డిజిటల్ విధానంలో ప్రతి రోజూ సుమారు రూ.150 కోట్ల వరకూ లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో ప్రతి నెలా దాదాపు రూ.9 వేల కోట్లు పైగా లావాదేవీలు జరుగుతూండగా.. వీటిలో నగదు రహిత లావాదేవీల వాటా సుమారు రూ.4,500 కోట్లు (50 శాతం) ఉంది. వీటిలోనూ వ్యవసాయం, వ్యాపార రంగాలదే పైచేయిగా కనిపిస్తోంది. ప్రతి ఆర్థిక సంవత్సరం జూన్, జూలై, జనవరి, ఫిబ్రవరి నెలల్లో వ్యవసాయ రంగం, డిసెంబర్, జనవరి నెలల్లో వ్యాపార రంగంలో నగదు రహిత లావాదేవీలు అత్యధికంగా జరుగుతున్నాయని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి.

పట్టణాల్లోనే అధికం

గడచిన ఆరు నెలల్లో కాకినాడ జిల్లాలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగిన లావాదేవీలు గణనీయమైన వృద్ధిని సాధించాయి. యూపీఐ ద్వారా జిల్లాలో రికార్డు స్థాయిలో 14,35,61,931 లావాదేవీలు జరిగాయని బ్యాంకుల నివేదికలను బట్టి స్పష్టమవుతోంది. పల్లెల్లో కంటే పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా నగదు రహిత లావాదేవీలు నమోదయ్యాయి. ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే వంటి స్మార్ట్ ఫోన్ యాప్‌లతో పాటు క్యూఆర్ కోడ్, ఏటీఎం కార్డులు, పల్లెల్లో బిజినెస్ కరస్పాండెంట్లు ఫింగర్ ప్రింట్లతో ఇచ్చే ఆధార్ పేమెంట్ల వంటివి నగదు రహిత లావాదేవీల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి.



బ్యాంకులకు వస్తున్న ఖాతాదారులు తగ్గారు



ఆర్‌బీఐ ప్రోత్సాహంతో బ్యాంకులన్నింటా నూరు శాతం డిజిటల్ లావాదేవీల కోసం గట్టి ప్రయత్నం జరుగుతోంది. డిజిటల్ లావాదేవీల కారణంగా ఖాతాదారులు వ్యయప్రయాసలతో బ్యాంకులకు రావాల్సిన అవసరం లేకుండా పోయింది. ఫలితంగా బ్యాంకులకు వచ్చి లావాదేవీలు నిర్వహించే ఖాతాదారుల సంఖ్య 50 శాతం తగ్గిపోయింది. దీంతో బ్యాంకులపై ఒత్తిడి బాగా తగ్గింది. ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ డిజిటల్ లావాదేవీలు నిర్వహించుకునే వెసులుబాటు లభించింది. ఖాతాదారులై ఉంటే చాలు క్యూఆర్ కోడ్ ఇస్తున్నాం.

– చందాల శ్రీవెంకట ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్, కాకినాడ

60 శాతం పెరిగిన డిజిటల్ పేమెంట్లు



మాది సంతూర్ సబ్బుల హోల్ సేల్ వ్యాపారం. ఇటీవల మా వ్యాపారం నగదు రహితంగానే జరుగుతోంది. గతంలో నూరు శాతం నగదు మారకం ద్వారానే జరిగేది. మా దగ్గరకు వచ్చే ప్రతి పది మంది చిరు వ్యాపారుల్లో ఆరేడుగురు ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే ద్వారానే లావాదేవీలు చేస్తున్నారు. ఇది చాలా సులభతరంగా జరిగిపోతోంది.

– కూరపాటి సూరిబాబు, కాకినాడ

డిజిటల్ పేమెంట్లతో ఇబ్బంది లేదు



ఇంతకు ముందు మార్కెట్‌కు వెళ్లాటే కచ్చితంగా చిల్లర రూపంలో నగదు తీసుకుని వెళ్లవలసి వచ్చేది. ఇది చాలా ఇబ్బందికరంగా ఉండేది. ఒక్కోసారి దుకాణాల్లో చిల్లర లేదనే సమస్యతో సమయం వృథా అయ్యేది. ఇప్పుడు డిజిటల్ పేమెంట్లతో చిల్లర సమస్య లేదు. సమయం కూడా ఆదా అవుతోంది. ఈ విధానం వినియోగదారుడితో పాటు వ్యాపారికి కూడా బాగుంటోంది.

– పాలెపు కోటేశ్వరరావు, కాకినాడ

టీఈసీసీతో ఆదిత్య యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న టీఈసీసీ ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య యూనివర్సిటీతో తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ (టీఈసీసీ) విద్యా విభాగం మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వివరాలను యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందంతో సాంస్కృతిక, విద్యా మార్పిడిని పెంపొందించడానికి అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల్లో మాండరిన్ భాషా నైపుణ్యాలను పెంపొందించడం, ఉద్యోగావకాశాల కోసం వారి అభ్యాసన అనుభవాన్ని, భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి వీలు కలుగుతుందని వివరించారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ డాక్టర్ పీఎస్ రంజిత్, డివిజన్ డైరెక్టర్ పీటర్స్ చెన్, తైవాన్ రాయబారి భౌషువాన్ గెర్, సీఈఓ శ్రీవిజయ కౌమార్ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా తైవాన్ పరిశ్రమలకు ప్రత్యేకమైన విద్యా వనరులు, ఉద్యోగావకాశాలు విద్యార్థులకు లభిస్తాయని తెలిపారు.

జుడోలో విద్యార్థినికి బంగారు పతకం



జుడోలో గోల్డ్ మెడల్ సాధించిన వెంకటలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు

తుని రూరల్: ఆదికవి నన్నయ ఇంటర్ కాలేజీస్ యూనివర్సిటీ జుడో సెలక్షన్ కం టోర్నమెంట్ 78 కిలోల ప్లస్ విభాగంలో తుని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల విద్యార్థిని జి.వెంకటలక్ష్మి బంగారు పతకం సాధించింది. ఈ నెల 10, 11 తేదీల్లో తాడేపల్లిగూడెంలో జరిగిన జుడో సెలక్షన్ కం టోర్నీలో గెలుపొందిన విద్యార్థినిని మంగళవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరఫున ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ జుడో మెన్ అండ్ ఉమెన్ టోర్నమెంట్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం వెంకటలక్ష్మికి దక్కడం సంతోషంగా ఉందన్నారు. మధ్యప్రదేశ్ భోపాల్‌లో ఆల్ ఇండియా టోర్నమెంట్ డిసెంబర్‌లో జరుగుతుందని ఆమె తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ హెచ్ఓడీ బి.నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ సానా రాజేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో అఘోరీ దర్శనానికి నిరాకరణ

- వస్త్రాలతో వస్తేనే అనుమతిస్తామన్న యంత్రాంగం
- పోలీసు ఆంక్షలకు లోబడి అఘోరీ పూజలు



భీమేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అఘోరీ

పెద్దాపురం/సామర్లకోట: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోట కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మహిళా అఘోరీ మంగళవారం పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వేకువజామునే వస్తున్న అఘోరీని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మార్గం మధ్యలో మాధవపట్నం వద్ద తమ సిబ్బందితో అడ్డుకున్నారు. అర్ధనగ్నంగా కాకుండా వస్త్రాలతో వస్తేనే ఆలయంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. దీనికి తొలుత అఘోరీ నిరాకరించారు. అలాగైతే, ఆలయం లోపలికి అనుమతించేది లేదని పోలీసులు కరాఖండీగా చెప్పారు. దీంతో చేసేది లేక అఘోరీ ఆంక్షలకు లోబడి, వస్త్రం ధరించి, మహిళా పోలీసు సిబ్బంది సంరక్షణలో వేకువజామున స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఆమె తనదైన పద్ధతిలో నిర్వహించిన పూజలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఆమెతో ఫొటోలు దిగేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు.

పంపా తరగలపై పరమాత్ముని విహారం

- నేడే సత్యదేవుని తెప్పోత్సవం
- హంస వాహనంపై విహరించనున్న సత్యదేవుడు, అమ్మవారు
- వేలాది మంది తిలకించేలా ఏర్పాట్లు



హంస వాహనంలా సిద్ధమైన తెప్పోత్సవం పంటు

అన్నవరం : క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా పరమాత్మ స్వరూపుడైన సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్ల తెప్పోత్సవం పంపా తరగలపై బుధవారం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన హంస వాహనంపై.. పండితుల వేద మంత్రోచ్ఛారణలు, కళ్లు మిరుమిట్లు కొలిపే బాణసంచా కాల్పుల నడుమ.. స్వామి, అమ్మవార్లు పంపా నదిలో విహరించే ఈ వేడుకను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలి రానున్నారు.

విస్తృత ఏర్పాట్లు

తెప్పోత్సవానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవానికి సిద్ధం చేసిన పంటును ఇప్పటికే హంస వాహనంగా అందంగా ముస్తాబు చేశారు. దానిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. తెప్పోత్సవం నిర్వహించే పవర్ హౌస్ వద్ద ఉన్న పంపా తీరాన్ని కూడా సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఘాట్ రోడ్ ముఖ ద్వారం నుంచి పవర్ హౌస్ వరకూ కూడా రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. తెప్పోత్సవానికి హాజరు కావాల్సిందిగా ప్రజా ప్రతినిధులను, జిల్లా అధికారులను ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులు, దేవస్థానం చైర్మన్, ఈఓ, ఇతర వీఐపీలు ఈ కార్యక్రమాన్ని ఒడ్డు నుంచి తిలకించేలా పంపా నదీ తీరంలో వీఐపీ లాంజ్ ఏర్పాటు చేశారు. తెప్పోత్సవానికి వేలాదిగా వచ్చే భక్తుల కోసం 150 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను, రెండు మోటార్ బోట్లను సిద్ధం చేశారు. మోటార్ బోట్లతో కూడా పంపా నదిలో ట్రయల్ రన్ నిర్వహించారు. తుని నుంచి అగ్నిమాపక శకటాన్ని కూడా తీసుకుని వచ్చి, సిద్ధంగా ఉంచుతున్నారు.

33 మందికే మాత్రమే అనుమతి

ఈసారి దేవస్థానం తరఫున 33 మందిని మాత్రమే తెప్ప మీదకు అనుమతించనున్నారు. వీరిలో ముగ్గురు దేవస్థానం వేద పండితులు, ప్రధానార్చకుడు, ఇద్దరు అర్చకస్వాములు, ఇద్దరు పరిచారకులు, ఇద్దరు సీనియర్ స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితులు, మంగళధ్వని కళాకారులు, పంటు ఆపరేటర్లు, దేవస్థానం విద్యుత్ విభాగ సిబ్బంది ఇద్దరు, పోలీసులు ఉంటారు. వీరందరూ విధిగా లైఫ్ జాకెట్లు ధరించాలని నిబంధన పెట్టారు.

ఉత్సవం జరుగుతుందిలా..

స్వామి, అమ్మవార్లను సాయంత్రం 5 గంటలకు రత్నగిరి నుంచి ఊరేగింపుగా పంపా తీరానికి తీసుకుని వస్తారు. అక్కడి పూజా మండపంలో 5.30 గంటలకు తులసీధాత్రి పూజ ఘనంగా నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు పంపా సరోవరంలో హంస వాహనంగా అలంకరించిన తెప్పపై ఏర్పాటు చేసిన రుద్రాక్ష మండపం మీద సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లను వేంచేయించి, పండితులు పూజలు చేస్తారు. తదనంతరం స్వామి, అమ్మవార్లను పంపా నదిలో మూడుసార్లు విహరింపజేస్తారు.

ఏర్పాట్లు పూర్తి

సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవం తరువాత అన్నవరం దేవస్థానంలో అంతటి ప్రాధాన్యం కలిగినది తెప్పోత్సవం. దీనిని తిలకించేందుకు వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో విస్తృత ఏర్పాట్లు చేశాం. భక్తులందరూ ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వీలుగా పంపా నదీ తీరం వెంబడి బారికేడ్లు ఏర్పాటు చేశాం. తెప్పోత్సవం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

న్యుమోనియా నియంత్రణే లక్ష్యంగా సాన్స్

- జీజీహెచ్‌లో ప్రారంభం
- 2025 ఫిబ్రవరి 28 వరకు నిర్వహణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహ నాయక్. చిత్రంలో డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని పీడియాట్రిక్ లెక్చర్ గ్యాలరీలో మంగళవారం అంతర్జాతీయ న్యుమోనియా దినోత్సవాన్ని నిర్వహించారు. జీజీహెచ్ చంటిపిల్లల వైద్య విభాగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ అధ్యక్షతన జరిగిందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ సాన్స్ (సోషల్ అవేర్నెస్ అండ్ యాక్షన్ ప్లాన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా సక్సెస్‌ఫుల్లీ) కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ ఏడాది నవంబర్ 12వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది వివిధ లక్షణాల ద్వారా న్యుమోనియాను ముందుగానే గుర్తించి 5 ఏళ్ల లోపు వయసున్న పిల్లల్లో ఆ సంబంధ మరణాలను తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తారన్నారు. సకాలంలో వైద్య సేవలు అందడం ద్వారా మరణాలు నియంత్రించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, డీఎల్ఏటీవో డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఒక నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న గోపిమూర్తి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): తూర్పు – పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండో రోజైన మంగళవారం ఒక నామినేషన్ దాఖలైంది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి కలెక్టర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రిటర్నింగ్ అధికారి షణ్మోహన్ సగిలి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుకు గడువు పెంపు

- ఈ నెల 21 వరకూ అవకాశం
- డిసెంబర్ 5 వరకూ రూ.వెయ్యితో చెల్లించే అవకాశం

అమలాపురం టౌన్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు తుది గడువును ఈ నెల 21వ తేదీ వరకూ పొడిగిస్తూ ఇంటర్మీడియెట్ విద్యా మండలి నిర్ణయించింది. జిల్లాలోని ఇంటర్ చదువుతున్న దాదాపు 27 వేల మంది విద్యార్థుల్లో చాలా మందికి ఈ ప్రకటన వెసులుబాటు కానుంది. వాస్తవానికి ఇంటర్ బోర్డు తొలుత ఫీజు చెల్లింపునకు అక్టోబర్ 21వ తేదీ నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ గడువు ప్రకటించింది. కొంతమంది విద్యార్థులు ఫీజులు చెల్లించకపోవడంతో ఈ గడువును పెంచుతూ ఇంటర్ బోర్డు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 21 వరకూ ఎలాంటి ఫైన్ లేకుండా కేవలం ఫీజు చెల్లించే వెసులుబాటును కల్పించింది. రూ.వెయ్యి ఫైన్‌తో ఫీజు చెల్లించేందుకు గడువును వచ్చే నెల డిసెంబర్ 5వ తేదీ వరకూ ఇచ్చింది. ఇదే ఆఖరి గడువు అని, మరోసారి గడువు పెంచే ఆస్కారం ఉండదని ఇంటర్మీడియెట్ బోర్డు స్పష్టం చేసింది. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక ఎయిడెడ్ కళాశాల, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 6 గురుకుల పాఠశాలలు, 105 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఈ మొత్తం కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 13,938 మంది, ద్వితీయ సంవత్సరంలో 13,940 మంది విద్యార్థులు చదువుతున్నారు. పలు అనివార్య కారణాలతో పరీక్ష ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ఈ గడువు పొడిగింపు ఎంతో ప్రయోజనకారి కానుంది.

సద్వినియోగం చేసుకోండి

ఇంటర్ బోర్డు పరీక్ష ఫీజు చెల్లింపునకు పెంచిన గడువును జిల్లాలోని విద్యార్థులు తక్షణమే సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈఓ) వనుము సోమశేఖరరావు విజ్ఞప్తి చేశారు. ఇంత వరకూ పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు తమ కళాశాలలకు వెళ్లి ఫీజు చెల్లించాలని సూచించారు. అన్ని కళాశాలల్లో ఫీజులు చెల్లించుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.